సాక్షి తిరుపతి

శనివారం । 10 । జూన్ । 2023



హోరాహోరీగా చంద్రగిరి ఐపీఎల్

తుమ్మలగుంటలో నిర్వహిస్తున్న చంద్రగిరి ఐపీఎల్ క్రికెట్ ఫైనల్స్ హోరాహోరీగా సాగుతున్నాయి.

- 8లో



కరిమాణిక్యుని పుష్పయాగం

నాయుడుపేట వద్ద తుమ్మురులో వెలసిన కరి మాణిక్యస్వామి వారికి శుక్రవారం పుష్ప యాగం నిర్వహించారు.

- 8లో

	గరిష్ఠం	కనిష్ఠం
తిరుపతి	38	27
చిత్తూరు	38	27
తిరుమల	34	22
గూడూరు	42	29
నగరి	40	28

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోవడంతో శిలాతోరణం వరకు భక్తులు బారులు తీరారు. గురువారం అర్ధ రాత్రి వరకు 38,076 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 35,618 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు.కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.67 కోట్లు ఆదాయం వచ్చింది. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

తిరుపతి-నెల్లూరుకు విద్యుత్ బస్సులు

తిరుపతి అర్బన్ : తిరుపతి సెంట్రల్ బస్టాండ్ నుంచి నెల్లూరుకు 12 విద్యుత్ బస్సులను శుక్రవారం ప్రారంభించారు. ఇవి రోజూ 18 ట్రిప్పులు నడవనున్నాయి. ఈ నాన్‌స్టాప్ సర్వీసుల్లో టికెట్ ధర పెద్దలకు రూ.350, పిల్లలకు రూ.265గా నిర్ణయించారు. మరో వారంలో తిరుపతి-మదనపల్లె 12 విద్యుత్ బస్సులను కేటాయించనున్నట్లు ఆర్టీసీ అధికారులు వెల్లడించారు.

'జగనన్నకు చెబుదాం' అర్జీలకు ప్రాధాన్యం

తిరుపతి అర్బన్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యమివ్వాలని జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు.శుక్రవారం ఆయన కలెక్టరేట్ నుంచి అధికారులతో వీడియో కాన్ఫెరెన్స్ ద్వారా మాట్లాడారు. మ్యుటేషన్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో విలేజ్ సర్వే డేటా ఎంట్రీ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. అసైన్డ్ భూములకు సంబంధించిన ఫైల్స్, కోర్టు కేసుల సమస్యలను తమ దృష్టికి తీసుకుని రావాలి స్పష్టం చేశారు. సమావేశంలో డీఆర్‌ఓ కోదండరామిరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, సర్వే శాఖ ఏడీ జయరాజ్ పాల్గొన్నారు.

ఆకతాయి చేష్టలు సహించం



స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు

తిరుపతి క్రైం: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి గొడవలకు పాల్పడినా, అసాంఘిక కార్యక్రమాలు చేపట్టినా సహించేది లేదని ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం నగరంలో ముమ్మరంగా పోలీసింగ్ నిర్వహించారు. పలుప్రాంతాల్లో డీఎస్పీ సురేందర్‌రెడ్డి పర్యవేక్షిస్తూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి అల్లర్లు సృష్టించేవారిపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. పట్టుబడిన వారికి కౌన్సెలింగ్‌తో పాటు కేసులు నమోదు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో అసాంఘిక కార్యక్రమాలు పాల్పడితే డయల్ 100కు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

15న హుండీ కానుకల లెక్కింపు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి హుండీ కానుకలను ఈ నెల 15న మంగళవారం లెక్కించనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. ఉదయం 7 నుంచి స్వామివారి ఆస్థాన మండపంలో హుండీ కానుకలు లెక్కించనున్నట్లు వెల్లడించారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పల్లెకు పట్టం కట్టింది. పాలనలో పారదర్శకత పెరిగింది. అభివృద్ధి, సంక్షేమం రెండూ క్షేత్రస్థాయికి చేరాయి. గ్రామాల్లో మౌలికవసతుల కల్పనకు ప్రాధాన్యత వచ్చింది. పంచాయతీల్లో రోడ్లు, నూతన ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ క్లినిక్‌లు పల్లె సీమలకు మణిహారాలుగా మారాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హుల ముంగిటకు చేరుతున్నాయి. వీటన్నింటిపైనా సమీక్షించేందుకు ప్రతి రెండు నెలలకోసారి నిర్వహించే జెడ్పీ సర్వసభ్య సమావేశం నేడు జరగనుంది.

పల్లెకు పట్టాభిషేకం



- జిల్లాలో చురుగ్గా అభివృద్ధి పనులు
- రూ.కోట్ల ఖర్చుతో పంచాయతీల్లో పనులకు శ్రీకారం
- పల్లె పాలనలో మరింత పెరిగిన పారదర్శకత
- నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

సాక్షి చిత్తూరు/చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని అన్ని శాఖల ప్రగతిపై ప్రతి రెండు నెలలకోసారి జెడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహించి పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. అందులో భాగంగా శనివారం జెడ్పీ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్ సమక్షంలో నిర్వహించనున్నారు. ఇందుకోసం ప్రధానంగా 12 అంశాలతో కూడిన ఎజెండాతోపాటు ఇతర అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు.



అందరికీ లబ్ధి

జిల్లాలోని అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతున్నాయి. సచివాలయాల ద్వారా ఇంటి వద్దకు వెళ్లి వలంటీర్లు సేవలు అందిస్తున్నారు. సచివాలయాల్లో పల్లె పాలనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్‌ల నిర్మాణం శరవేగంగా సాగుతోంది. పశ్చిమ మండలాలకు శాశ్వతంగా నీటి సమస్యను పరిష్కరించేందుకు రూ.2వేల కోట్లతో ప్రాజెక్టు సర్వే పనులు సాగుతున్నాయి.

పారదర్శక పాలన



ఉమ్మడి జిల్లాలో ప్రజలకు పారదర్శక పాలన అందుతోంది. గ్రామీణులకు మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో ఉద్యోగులు సేవలు అందిస్తున్నారు. పిల్లల నుంచి వృద్ధుల వరకు బాగుండాలని పథకాలను ఇస్తున్నారు. విద్య, వైద్యం, మహిళలు, రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. నవరత్నాలతోపాటు పేదల కల అయిన సొంత ఇంటి నివాసానికి రుణ సదుపాయం ఇస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నారు. ప్రజల సంక్షేమంపై చిత్తశుద్ధితో పనిచేస్తున్నారు.

– గోవిందప్ప శ్రీనివాసులు, జెడ్పీ చైర్మన్

సంక్షేమం - అభివృద్ధి

గత ఆర్థిక సంవత్సరం వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ కింద ఉమ్మడి జిల్లాలో 4,39,167 మంది రైతుల ఖాతాలకు రూ.572.67 కోట్లు జమ చేశారు. వైఎస్సార్ సున్నావడ్డీ కింద పంటరుణాల కోసం 48,395 మంది రైతులకు రూ.62.24 కోట్లు వడ్డీ రాయితీని వారి ఖాతాలకు జమ చేశారు. పంట రుణాల కింద రూ.10,096 కోట్లు రైతులకు అందజేశారు.

- జిల్లాలో గ్రామీణ నీటి సరఫరాశాఖ కింద మంజూరైన 13,061 పనుల కోసం రూ.151 కోట్లు ఖర్చు చేశారు. జగనన్న కాలనీల ఏర్పాటులో సొంత ఇంటి కలను సాకారం చేయడంలో భాగంగా పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా 1,22,348 గృహాలు బేస్‌మెంట్ పరిధి దాటాయి. ఇందుకోసం రూ.1,498 కోట్లు ఖర్చు చేశారు. 15,789 నూతన వ్యవసాయ సర్వీసులకు రూ.315 కోట్ల వ్యయంతో విద్యుత్ సరఫరా చేశారు. ఎస్సీ, ఎస్టీ, ఇతర అర్హులైన లబ్ధిదారులకు 200 యూనిట్లు ఉచితంగా 2,28,901 మందికి అందజేయగా వాటి కోసం రూ.4.52 కోట్లు ఖర్చు చేశారు. ఆర్‌డీఎస్ఎస్ పథకం కింద వ్యవసాయ సర్వీసులకు ప్రత్యేక ఫీడర్ల ఏర్పాటు కోసం రూ.1673.6 కోట్ల పనులకు ఒప్పందం కుదిరింది.
- ఉమ్మడి జిల్లాలో వృద్ధాప్య, వితంతు, చేనేత, వికలాంగ, అభయహస్తం, కల్లుగీత, హిజ్రాలు, ఒంటరిమహిళ అన్ని రకాల కేటగిరి పింఛన్లు కలిపి 5,51,705 మందికి రూ.1646.34 కోట్లు అందజేశారు. వైఎస్సార్ చేయూత కింద మూడో విడతగా 1,99,459 మందికి రూ.373.99 కోట్లు అందజేశారు. వైఎస్సార్ ఆసరా కింద 60,440 సంఘాల పొదుపు ఖాతాలకు రూ.580.18 కోట్లు ఇచ్చారు. వైఎస్సార్ సున్నావడ్డీ కింద 68,440 స్వయం సహాయక సంఘాలకు రూ.134.05 కోట్లు అందజేశారు. జగనన్న తోడు కార్యక్రమంలో భాగంగా చిరువ్యాపారులకు 1,58,094 మందికి రూ.158.09 కోట్లు రుణం ఇచ్చారు. వడ్డీ



రాయితీ కింద 65,916 మంది లబ్ధిదారులకు రూ.1.77 కోట్లు అందజేశారు. స్త్రీ నిధిలో 82,909 మందికి రూ.350.05 కోట్లు రుణ సౌకర్యం కల్పించారు. ఎస్సీ, ఎస్టీల్లో 9,314 మందికి రూ.45.16 కోట్లు సబ్‌ప్లాన్ కింద అందజేశారు. మహిళ సంఘాలకు గృహ నిర్మాణం కోసం ప్రభుత్వం అందించే సాయం రూ.1.80 లక్షలతో పాటు అదనంగా మరో రూ.35,000 చొప్పున అందజేస్తున్నారు. అలా మొత్తం 89,346 మందికి రూ.332.30 కోట్లు అందజేశారు.



- ఆరోగ్య శ్రీ కింద 12,747మందిని చికిత్సతో ఆదుకున్నారు. 17,919 మంది మహిళలకు ప్రసవాలు చేశారు. 37,525 మందికి డయాలసిస్ సెషన్స్ నిర్వహించారు.
- మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 1.64 లక్షల కుటుంబాలకు 35.02 లక్షల పని దినాలు కల్పించి, రూ.89.03 కోట్లు అందజేశారు.

కొత్తగా 33 సబ్‌స్టేషన్ల నిర్మాణాలను రూ.58 కోట్లతో చేపట్టనున్నారు.

- పంచాయతీరాజ్‌శాఖ పరిధిలో 563 గ్రామ సచివాలయాలు, 489 రైతు భరోసా కేంద్రాలు, 208 వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాలను నిర్మించారు. వీటి కోసం రూ.376.26 కోట్లు ఖర్చు చేశారు. పీఎంజీఎస్‌వై కింద 131 కోట్లతో 100 కిలోమీటర్లు, ఏపీఆర్ఆర్‌పీ కింద రూ.254 కోట్లతో 210 కిలోమీటర్ల రోడ్లను వేశారు.





- అమ్మఒడి కింద రూ.505 కోట్లు విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమ చేశారు. మధ్యాహ్న భోజన పథకం కింద జిల్లాలోని 3,36,422 మంది విద్యార్థులకు నాణ్యమైన పౌష్టి కాహారం అందించారు. చిక్కీలు అందించని రోజుల్లో రాగి జావ ఇచ్చారు. డిజిటల్ విద్యలో భాగంగా 39,003 మంది విద్యార్థులు, 5,532 మంది ఉపాధ్యాయులకు ఉచితంగా ట్యాబ్‌లు పంపిణీ చేశారు. నాడు-నేడు కింద 1,533 పాఠశాలలు, 30 జూనియర్ కళాశాలల్లో రూ.778కోట్లతో ఆధునీకరణ పనులు అమల్లోకి తీసుకొచ్చారు. జగనన్న విద్యాకానుక కిట్ల కింద రూ.68.30 కోట్లతో 3,47,748 మంది విద్యార్థులకు యూనిఫాం, బెల్ట్, షూస్, సాక్స్, నోట్, టెస్ట్, వర్క్ బుక్స్ అందజేశారు.

థ్యాంక్యూ సీఎం జగన్ సార్



చిత్తూరులో ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వైద్య సిబ్బంది



వెంకటగిరిలో క్షీరాభిషేకం చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

చిత్తూరు రూరల్: వైద్యవిధాన పరిషత్ చట్టాన్ని రద్దు చేస్తూ ఆస్పత్రులన్నీ ఒకే డైరెక్టరేట్‌గా మార్పు చేస్తూ తీసుకున్న నిర్ణయం హర్షణీయమని జిల్లా వైద్య విధాన పరిషత్ ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేశారు. ఈమేరకు చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట శుక్రవారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. థ్యాంక్యూ సీఎం సార్ అంటూ జేజేలు పలికారు. వారు మాట్లాడుతూ ఇదివరకు గ్రాంట్ ఇన్ ఎయిడ్ ద్వారా జీతాలు ఇచ్చేవారన్నారు. ఈ చెల్లింపులో చాలా ఇబ్బందులున్నాయన్నారు. కొన్నేళ్లుగా దీనిపై పోరాటం చేసినా ఫలితం లేదని మూడేళ్ల కిందటే ఆ ఆశను వదులుకున్నామన్నారు. కానీ ప్రభుత్వం తమ ఇబ్బందులను గుర్తించి 010 పద్దు ద్వారా చెల్లించాలన్న నిర్ణయం తీసుకుందన్నారు. ఇన్నాళ్లకు మా ఆశలు నెరవేరాయని సంతోషం వ్యక్తం చేశారు. జిల్లాలో పనిచేస్తున్న 1,230 మంది ఉద్యోగులకు ఇది తీపికబురని, సీఎంకు తాము రుణపడి ఉంటామని స్పష్టం చేశారు. డీసీహెచ్ఎస్ బీఎస్‌కే నాయక్, సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్, అధికారులు వెంకట ప్రసాద్, వరలక్ష్మి,రాణి, పూమాల, భాస్కర్, గుణ పాల్గొన్నారు.

మేలు మరువలేం

వెంకటగిరి : కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేలును మరువలేమని వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఫార్మాసిస్ట్ అసోసియేషన్ నేత విజయకుమార్, వైద్యాధికారులు జిలానీబాషా, తులసికుమారి పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల పురోగతిపై సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్ : నగరంలోని జగనన్న లేఅవుట్లలో చేపట్టిన గృహనిర్మాణాల పురోగతిపై కలెక్టర్ వెంకటరమణారెడ్డి సమీక్షించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ హరితతో కలసి అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేకంగా నియమించిన నోడల్ అధికారి నేతృత్వంలో ఇంటి నిర్మాణాలను మరింత వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. వర్షకాలం ప్రారంభమయ్యే నాటికి ఇళ్ల పనులు పూర్తి కావాలని సూచించారు. చిందేపల్లె, జి.పాళెం, కల్లూరు, ఎం.కొత్తపల్లె, సూరప్పకశం, పీసీ అగ్రహారం లేఅవుట్లలో మెరుగైన వసతులు కల్పించాలని స్పష్టం చేశారు. హౌసింగ్ పీడీ వెంకటేశ్వర్లు, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డీఈలు విజయకుమార్ రెడ్డి, సంజయ్‌కుమార్, గోమతి, దేవిక, మహేష్ పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 147 మందికి ఉద్యోగాలు

సూళ్లూరుపేట : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, సీఈఈడీఏపీ, జేకేసీ వారి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో 147 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మొత్తం 17 బహుళజాతి కంపెనీల ప్రతినిధులు 347 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు, రాత పరీక్షలు నిర్వహించారు. ప్రతిభ కనబరచినవారికి ఉద్యోగావకాశం కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎల్‌వీ శంకరశర్మ, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి శ్యామ్‌మోహన్, డీఈఓ వెంకటరమణ, డీఈడీ చీఫ్ శ్రీనివాసులు, ఎంపీడీఓలు ప్రమీలారాణి, సింగయ్య, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాసరావు, ప్లేస్‌మెంట్ అధికారి ఎం.యలమందరావు పాల్గొన్నారు.

సాక్షి మీడియా గ్రూప్ , ఆర్.సి ఎగ్జామ్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో

గ్రూప్-2 ఉద్యోగ పరీక్షలపై రేపు ఉచిత అవగాహన సదస్సు

- జూన్ 11వ తేదీ (ఆదివారం) ఉదయం 09:00 నుంచి 12:30 వరకు
- టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రామాణిక స్టడీ మెటీరియల్

సాక్షి, ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్‌లో భారీ ఎత్తున గ్రూప్-2 ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. దాదాపు 1000 వరకు గ్రూప్-2 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఈ నేపథ్యంలో.. గ్రామీణ విద్యార్థులను ప్రభుత్వ ఉద్యోగులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో.. సాక్షిఎడ్యుకేషన్.కామ్ (www.sakshieducation.com) రాష్ట్రంలోని ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ ఆర్.సి ఎగ్జామ్స్ కలిసి జూన్ 11వ తేదీ(ఆదివారం) ఉదయం 09:00 నుంచి 12:30 వరకు తిరుపతిలోని Mahati Auditorium, Balaji Colony, Near Town Club నందు ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ పోటీపరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు సాక్షిఎడ్యుకేషన్.కామ్ తోడుగా ఉంటున్న విషయం మీ అందరికి తెల్సిందే. అవగాహన సదస్సు, టాలెంట్ టెస్ట్‌కు హాజరయ్యే విద్యార్థులు ముందుగా 8985094499 ఫోన్ నెంబర్‌కు తమ పేరు, ఫోన్ నెంబర్, జిల్లా వివరాలను వాట్సప్‌లో పంపాలి.

అవగాహన సదస్సు తేదీ : జూన్ 11, 2023 (ఆదివారం)
వేదిక : Mahati Auditorium, Balaji Colony, Near Town Club, Tirupati.
సమయం : ఉదయం 09:00 నుంచి 12:30 వరకు

స్విమ్స్ నెఫ్రాలజీలో 'టెలీ మెడిసిన్'

- అధికారులను ఆదేశించిన టీటీడీ ఈఓ ధర్మారెడ్డి

తిరుపతి తుడా : కిడ్నీ వ్యాధులతో బాధపడే వారికి తగు సలహాలు, వైద్య సహాయం అందించేందుకు స్విమ్స్ ఆస్పత్రిలోని నెఫ్రాలజీ విభాగంలో టెలీ మెడిసిన్ వ్యవస్థను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి ఆదేశించారు. శుక్రవారం తిరుపతిలోని స్విమ్స్‌లో నెఫ్రాలజీ, యూరాలజీ విభాగాలను ఆయన పరిశీలించారు. ఇన్ పేషెంట్, డయాలసిస్, ఐసీయూ వార్డులను సందర్శించారు. ఈ సందర్భంగా డయాలసిస్‌కు వినియోగించే బ్యాగులకు కొరత ఉందని వైద్యులు తెలియజేయడంతో ఈఓ వెంటనే స్పందించారు. ఏపీఎంఐడీసీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డితో ఫోన్ మాట్లాడి స్విమ్స్‌కు డయాలసిస్ బ్యాగులను పంపించాలని కోరారు. రోగులతో మాట్లాడి అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. స్విమ్స్ హాస్టల్ విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్న టిఫిన్, భోజనం నాణ్యతపై ఆరా తీశారు. అనంతరం ఆస్పత్రి విభాగాధిపతులతో సమీక్ష నిర్వహించారు. ధర్మారెడ్డి మాట్లాడుతూ ఆస్పత్రి నిర్వహణకు సంబంధించిన సాఫ్ట్‌వేర్‌లో ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఐటీ విభాగం అధికారులను ఆదేశించారు. నెఫ్రాలజీ, యూరాలజీ విభాగాల పనితీరు బాగుందని అభినందించారు. రోగులకు నాణ్యమైన వైద్యాన్ని అందించేందుకు టీటీడీ తరఫున సంపూర్ణ సహకారం అందిస్తామని స్పష్ట చేశారు. కార్యక్రమంలో టీటీడీ జేఈఓ సదాభార్గవి, స్విమ్స్ డైరెక్టర్ వెంగమ్మ, టీటీడీ ఎఫ్ఏ సీఏఓ బాలాజీ, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ అనిల్ , డాక్టర్ శివకుమార్, డాక్టర్ నాగరాజు, జీఎం సురేష్ కుమార్, టీటీడీ ఐటీ జీఎం సందీప్, ఈఈ ప్రసాద్, నర్సింగ్ ఏడీ ప్రభావతి పాల్గొన్నారు.



రోగులతో మాట్లాడుతున్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డి

క్లుప్తంగా

నిరంతర శ్రమతోనే విజయం



తిరుపతి ఎడ్యుకేషన్ : విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని నిరంతరం శ్రమిస్తే విజయం సొంతమవుతుందని అంతర్జాతీయ హాకీ క్రీడాకారిణి రజని తెలిపారు. శుక్రవారం తిరుపతిలోని ఎస్వీ ఆర్ట్స్, ఎస్వీడబ్ల్యూ జూనియర్ కళాశాల విద్యార్థులతో నిర్వహించిన 'ఇంటరాక్షన్ విత్ రజని' కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పరాజయంతో కుంగిపోకుండా విజయంకోసం మొక్కవోని దీక్షతో కృషి చేయాలని సూచించారు. అనేక పరాజయాలు ఎదుర్కొన్న తర్వాతే నేడు అంతర్జాతీయ క్రీడాకారిణిగా మీ ముందున్నానని, శ్రీవారి దయతోనే ఈ స్థాయిని అందుకోగలిగానని తెలిపారు. జీవితంలో ఎన్ని సమస్యలు ఎదురైనా వెనుకంజ వేయకుండా లక్ష్యసాధన దిశగా ముందుకుసాగాలని కోరారు. ముఖ్యంగా మహిళలు అత్యంత ధైర్యంగా సమస్యలను ఎదిరించాలని వెల్లడించారు. కార్యక్రమంలో టీటీడీ డీఈఓ డాక్టర్ భాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు డాక్టర్ నారాయణమ్మ, డాక్టర్ భువనేశ్వరి, పీడీ డాక్టర్ మస్తాక్ అహ్మద్, అధ్యాపకులు డాక్టర్ భాస్కర్, డాక్టర్ భీమన్న, కిరణ్ కుమార్, రామకృష్ణారెడ్డి, విజయశ్రీ పాల్గొన్నారు.

వైభవంగా వసంతోత్సవం

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామికి శుక్రవారం సాయంత్రం వైభవంగా వసంతోత్సవంలో నిర్వహించారు. బ్రహ్మోత్సవాల ధ్వజావరోహణమైన మరుసటి రోజు సాయంత్రం వసంతోత్సవం నిర్వహించడ ఆనవాయితీ. అందులో భాగంగా ఉదయం సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్యపూజలు, అభిషేకాలు పూర్తి చేశారు. సాయంత్రం తిరుచ్చి వాహనంపై ఉభయ నాంచారులతో కూడిన శ్రీవారిని కొలువుదీర్చి, మాడవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా శ్రీవారి పరిచారకులు తిరుచూర్ణ, సుగంధ ద్రవ్యాలను భక్తులపై చిలకరించారు. ఆలయానికి చేరుకున్న దేవదేవేరులకు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆర్జితం అధికారి భరత్, ప్రధాన అర్చకుడు శ్రీధరభట్టాచార్య పాల్గొన్నారు.

హోరాహోరీగా చంద్రగిరి ఐపీఎల్ ఫైనల్స్

- ఆర్సీపురం మండల విజేత సీకేపల్లె జట్టు
- ఎర్రావారిపాళెం చాంపియన్‌గా పి.వడ్డిపల్లె జట్టు
- విజేతలకు రూ.5 లక్షల బహుమతుల పంపిణీ



సరదాగా క్రికెట్ ఆడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనాథరెడ్డి



రామచంద్రాపురం మండల విన్నర్స్ సీకే పల్లె జట్టుకు ట్రోఫీ, నగదు బహుమతి అందిస్తున్న తుడా వీసీ హరికృష్ణ, మాజీ ఎమ్మెల్యే శ్రీనాథరెడ్డి, మోహిత్‌రెడ్డి



ఎర్రావారిపాళెం మండల విన్నర్స్ సి.వడ్డిపల్లె జట్టుకు ట్రోఫీ అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనాథరెడ్డి, తుడా వీసీ హరికృష్ణ, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్ : చంద్రగిరి ఐపీఎల్ క్రికెట్ పోటీలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. టోర్నమెంట్ కార్యానిర్వాహక కమిటీ చైర్మన్, చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలాల వారీగా జరుగుతున్న ఫైనల్ మ్యాచ్‌లు రసవత్తరంగా సాగుతున్నాయి. ఇప్పటికే తిరుపతి రూరల్, చంద్రగిరి, పాకాల, చిన్నగొట్టిగల్లు మండలాల మ్యాచ్‌లు ముగిశాయి. శుక్రవారం రామచంద్రాపురం, ఎర్రావారిపాళెం మండలాల ఫైనల్ మ్యాచ్‌లు జరిగాయి. ఉదయం బోడేవాండ్లపల్లె పంచాయతీ పి.వడ్డిపల్లె ఎలెవన్, చెరుకువారి పల్లి నుంచి బబ్లూస్ ఎలెవన్ మధ్య హోరాహోరీగా మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పి.వడ్డిపల్లె ఎలెవన్ జట్టు 15 ఓవర్లకు 129 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన బబ్లూస్ ఎలెవన్ జట్టు పేలవ ప్రదర్శనతో 75 పరుగులకే ఆలౌట్ అయ్యింది. 54 పరుగుల తేడాతో పి.వడ్డిపల్లె జట్టు ఎర్రావారిపాళెం మండలం చాంపియన్‌గా అవతరించింది. మహేంద్ర బెస్ట్ బ్యాట్స్‌మన్‌గా, ఎం.వెంకటేష్ బెస్ట్ బౌలర్‌గా, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా వెంకటేశ్వరరావు అవార్డులు కైవసం చేసుకున్నారు.

రామచంద్రాపురం విజేత సీకే పల్లె

రామచంద్రాపురం మండల స్థాయి ఫైనల్స్ మ్యాచ్‌లో సీకే పల్లె జట్టు, సి.రామాపురం ఎలెవన్ తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న సీకే పల్లె జట్టు నిర్ణీత 15 ఓవర్లకు 140 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన సి.రామాపురం ఎలెవన్ 15 ఓవర్లకు 123 పరుగులకు పరిమితమైంది. 18 పరుగుల తేడాతో సీకేపల్లె జట్టు మండల విజేతగా నిలిచింది. బెస్ట్ బ్యాట్స్‌మన్‌గా భాస్కర్, బెస్ట్ బౌలర్‌గా గోపి, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా పురుషోత్తం అవార్డులు అందుకున్నారు.

సందడే.. సందడి

ఎర్రావారిపాళెం, రామచంద్రాపురం మండలాల ఫైనల్స్ మ్యాచ్‌లు వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో యువత మైదానాలకు తరలివచ్చారు. క్రీడాకారులు సిక్సర్లు, ఫోర్ల మోత మోగించిన ప్రతిసారి కేరింతలు కొడుతూ సందడి చేశారు.

విజేతలకు బహుమతులు

ఎర్రావారిపాళెం మండల చాంపియన్ పి.వడ్డిపల్లె ఎలెవన్ జట్టుకు తుడా వీసీ హరికృష్ణ, మాజీ ఎమ్మెల్యే శ్రీనాథరెడ్డిల చేతులు మీదుగా ట్రోఫీ, రూ.లక్ష నగదు బహుమతి అందించారు. అలాగే రన్నర్స్‌గా నిలిచిన చెరుకువారిపల్లె బబ్లూస్ ఎలెవెన్ జట్టుకు రూ.75వేలు, 3వ స్థానంలో నిలిచిన నెరబైలు-2 జట్టుకు రూ.50వేలు, 4వ స్థానంలోని నెరబైలు-1 జట్టుకు రూ.25 వేలు నగదు బహుమతులను పంపిణీ చేశారు. రామచంద్రాపురం మండల విజేత సీకేపల్లె జట్టుకు ట్రోఫీ, రూ.లక్ష నగదు, రన్నర్స్‌గా నిలిచిన సి.రామాపురం ఎలెవన్ జట్టుకు ట్రోఫీ రూ.50 వేలు, 3వ స్థానంలోని కొత్త వేపకుప్పం వీపీకే ఎలెవన్ జట్టుకు రూ.50 వేలు, 4వ స్థానంలో నిలిచిన నడవలూరు ఎలెవన్ జట్టుకు రూ.25 వేలు నగదు బహుమతులు అందజేశారు.



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,770
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,547
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.75,900
రిటైల్ వెండి గ్రాము	రూ.77.90

రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌గా ఉమామహేశ్వరి



ప్రొఫెసర్ పి.ఉమా మహేశ్వరి

తిరుపతి ఎడ్యుకేషన్ : శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ మైక్రోబయాలజీ విభాగపు ప్రొఫెసర్ పి.ఉమా మహేశ్వరి రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. మహిళా వర్సిటీలో వివిధ హోదాల్లో ఆమె పనిచేశారు. ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌గా ఆమె నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ప్రజాసేవే లక్ష్యంగా వైద్యశిబిరం



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జేసీ బాలాజీ

భాకరాపేట : ప్రజాసేవే లక్ష్యంగా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారని జాయింట్ కలెక్టర్ బాలాజీ కొనియాడారు. శుక్రవారం చిన్నగొట్టిగల్లు మండలం టి.చట్టేవారిపాళెం పంచాయతీ ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. జేసీ మాట్లాడుతూ సుమారు రూ.3వేల విలువైన పరీక్షలను ఉచితంగా చేయించడం అభినందనీయమన్నారు. ప్రజల ఆరోగ్యస్థితిగతులను తెలియజేసే ఈ కార్యక్రమానికి అపూర్వ స్పందన లభిస్తోందని తెలిపారు. వలంటీర్లు క్షేత్రస్థాయిలో వైద్యశిబిరంపై అవగాహన కల్పిస్తున్నారని చెప్పారు. ప్రజలందరికీ వైద్యపరీక్షలు చేయించడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని వెల్లడించారు. అనంతరం పరీక్షలకు వచ్చిన వారితో ఆయన మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వైద్యశిబిరంలో సుమారు 1,500 మందికి పరీక్షలు చేయించినట్లు తెలిపారు. ఆర్డీఓ భాస్కర్‌నాయుడు, డీఎల్‌డీఓ సుశీలాదేవి, ఎంపీపీ యుగంధర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు స్వరూప, సర్పంచ్ ధనలక్ష్మి, ఎంపీడీఓ దేవేంద్రబాబు, ఈఓపీఆర్‌డీ మదనమోహనరాజు, డివిజన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్‌రెడ్డి, మండల కన్వీనర్ ఖదీర్‌అహ్మద్, వైద్యాధికారి శశికళ పాల్గొన్నారు.

శోభాయమానం.. కరిమాణిక్యుని పుష్పయాగం



పుష్పయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని తుమ్మూరు వద్ద వెలసిన శ్రీదేవి భూదేవి సమేత కరిమాణిక్య స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజు శుక్రవారం రాత్రి వైభవంగా పుష్పయాగం నిర్వహించారు. ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు చేపట్టారు. ముందుగా పుష్పయాగం కోసం తీసుకొచ్చిన సుగంధ సుమాలను బుట్టల్లో నింపి ఆలయ ఇన్‌స్పెక్టర్లు హరిరెడ్డి, సుధీర్ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలతో ప్రదక్షిణ చేశారు. అనంతరం ఆలయ ప్రధానార్చకుడు శేషాద్రిస్వామి, టీటీడీ వేదపండితులు శాస్త్రోక్తంగా యాగం నిర్వహించారు.

చదువు'కిట్టు'కు ఇదే!

- మండల కేంద్రాల నుంచి పాఠశాలలకు చేరిన జేవీకే కిట్లు
- తరగతుల వారీగా విభజన చేస్తున్న అధికారులు



కిట్లు పరిశీలిస్తున్న డీఈఓ, సీఎంఓ

తిరుపతి ఎడ్యుకేషన్ : ఒకప్పుడు పాడుబడిన బడులు.. ఎప్పుడొస్తాయో తెలియని విద్యాసామగ్రితో విద్యార్థులు అయోమయానికి గురయ్యేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా మారింది. పాఠశాల ప్రారంభానికి ముందే జగనన్న విద్యాకానుక(జేవీకే) కిట్లు.. నిర్ణయించిన తేదీల్లోనే జగనన్న అమ్మ ఒడి, ఫీజురీయింబర్స్‌మెంట్ తదితరాలతో విద్యార్థులు బడి అంటే ఎగిరి గంతేస్తున్నారు. ఇప్పుడు వేసవి సెలవులు ముగించుకుని పాఠశాలలు పునః ప్రారంభం నాటికే ప్రతి విద్యార్థి చేతిలో జగనన్న విద్యాకానుక(జేవీకే) కిట్లు ఉండాలని నిర్ణయించారు. ఆ మేరకు విద్యాశాఖ అధికారులు ప్రణాళిక సిద్ధం చేసి కసరత్తు చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికే కిట్లు జిల్లా కేంద్రానికి చేర్చగా.. అక్కడి నుంచి పాఠశాలలకు పంపిణీ చేసే ఏర్పాట్లలో అధికారులు తలమునకలయ్యారు. జిల్లాలోని 34 మండలాల పరిధిలోని అన్ని యాజమాన్య ప్రభుత్వ పాఠశాలల్లోని 1.66లక్షల మంది విద్యార్థులకు తొలి రోజే విద్యాకానుకను అందించేందుకు వడివడిగా పనులు చేపట్టారు. ఈ నెల 12వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారికంగా జేవీకే పంపిణీ ప్రారంభించనున్నారు. అదే రోజు విద్యార్థులందరికీ జేవీకే కిట్లను అందించేలా చర్యలు తీసుకున్నారు.

పండుగవాతావరణంలో..

తిరుపతి ఎడ్యుకేషన్: పాఠశాలలు ఈ నెల 12వ తేదీన పునఃప్రారంభం కానున్నందున జగనన్న విద్యాకానుక (జేవీకే) కిట్‌లను పండుగ వాతావరణంలో విద్యార్థులకు పంపిణీ చేయాలని డీఈఓ వి.శేఖర్ ఆదేశించారు. శుక్రవారం జిల్లాలోని మొత్తం 34మండలాల ఎంఈఓలతో ఆయన వర్చువల్ సమావేశం నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ జేవీకే కిట్‌ల పంపిణీ కార్యక్రమానికి వంద శాతం విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరయ్యేలా చూడాలని సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించి వారి చేతుల మీదుగా కిట్‌లను అందజేయాలని కోరారు. డ్యామేజ్ అయినవి, మిస్ మ్యాచ్ సామగ్రిని రిటర్న్ చేయాలని స్పష్టం చేశారు. పిల్లలకు నాణ్యమైన వస్తువులనే అందించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి జి.సురేష్ పాల్గొన్నారు.

విద్యార్థులందరికీ జేవీకే కిట్లు



ఈ నెల 12వ తేదీన పాఠశాలలు తెరుచుకోనున్న నేపథ్యంలో జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో విద్యనభ్యసించే ప్రతి విద్యార్థికి జేవీకే కిట్లును అందించే పనిలో ఉన్నాం. ఇప్పటికే మండల స్టాక్ పాయింట్ నుంచి అన్ని పాఠశాలలకు దాదాపుగా చేరవేశాం. వీటిని తరగతుల వారీగా విభజించి 12వ తేదీన విద్యార్థులకు అందించనున్నాం.

– డాక్టర్ వి.శేఖర్, జిల్లా విద్యాశాఖాధికారి, తిరుపతి

చేరవేసే పనిలో ఉన్నాం



పాఠశాలల పునఃప్రారంభం రోజే ముఖ్యమంత్రి జేవీకే కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో అదే రోజు జిల్లాలోని విద్యార్థులందరికీ అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టాం. జిల్లా నుంచి మండలానికి, అక్కడి నుంచి పాఠశాలకు చేరవేస్తున్నాం. ఈ నెల 12న ఆయా పాఠశాలల్లో జేవీకే కిట్లును సిద్ధంగా ఉంచనున్నాం.

– జి.సురేష్, జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్, తిరుపతి

కంటైనర్ లారీలో చోరీ

దొరవారిసత్రం : చెన్నై నుంచి నెల్లూరు జాతీయ రహదారిపై డీవీ సత్రం వద్ద ఓ కంటైనర్ లారీలో గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వివరాలు.. ఆన్‌లైన్ విక్రయ సంస్థ ఫ్లిప్‌కార్ట్‌కు చెందిన వస్తువులతో చెన్నై నుంచి కంటైనర్ లారీ బయలుదేరింది. మార్గం మధ్యంలో లారీ వెళుతుండగానే వెనుక డోర్లు పగులగొట్టి అందులో వస్తువులను కొందరు అపహరించారు. ఈ విషయాన్ని గుర్తించిన డ్రైవర్ వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నాయుడుపేట సీఐ సోమయ్య ఆధ్వర్యంలో ఫ్లిప్‌కార్ట్ ప్రతినిధులు కంటైనర్‌లోని వస్తువులను పరిశీలించారు. సుమారు రూ.లక్షలోపు సామగ్రి చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అసభ్యంగా ప్రవర్తించిన ఎఫ్‌ఆర్‌ఓపై కేసు

దొరవారిసత్రం : తోటి ఉద్యోగినితో అసభ్యంగా ప్రవర్తించిన ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌పై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. నేలపట్టు పక్షుల కేంద్రం రేంజ్ పరిధిలోని వెదురుపట్టు బీట్‌లో ఓడీపై ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న మహిళా ఉద్యోగి వారం క్రితం చిట్టమూరు బీట్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆమె డీవీ సత్రంలోని ఫారెస్ట్ రేంజర్ కార్యాలయానికి వెళ్లి తనను రిలీవ్ చేయాలని కోరారు. అయితే సదరు రేంజ్ అధికారి వరప్రసాద్ ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో బాధితురాలు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, సీఐ సోమయ్య స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధితురాలితో మాట్లాడి వివరాలు తెలుసుకుని కేసు నమోదు చేశారు. ఎస్ఐ తిరుమలరావు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

వరదయ్యపాళెం: మండలంలోని బత్తలవల్లం పంచాయతీ కృష్ణాపురంలో శుక్రవారం విద్యుదాఘాతంతో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం నుంచి కుంభాభిషేక ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ వేడుకలకు విద్యుద్దీపాలంకరణ చేసేందుకు నగరి సమీపంలోని ఊచవనత్తం గ్రామస్తులు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులకు ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాల కటౌట్ కూలిపోయింది. దీన్ని మళ్లీ అమర్చేందుకు యత్నిస్తుండగా పైన ఉన్న 11 కేవీ విద్యుత్ తీగ తగలడంతో డేనియల్, ఆశీర్వాదం అనే ఇద్దరు కార్మికులు షాక్‌కు గురయ్యారు. వీరిలో ఆశీర్వాద (32) అక్కడికక్కడే మరణించాడు. మృతుడికి విజయపురం మండలం మాధవరం కాగా, గాయపడిన డేనియల్(22) కీళపట్టుకు చెందినవాడు. ఎస్ఐ నాగార్జునరెడ్డి ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పాఠశాలలో మహనీయుల విగ్రహాలు



వివేకానంద విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న డీఈఓ శేఖర్, ఈఓ వెంకటేశు

రేణిగుంట : మండలంలోని కరకంబాడి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్వామి వివేకానంద, బీఆర్ అంబేడ్కర్, ఏపీజే అబ్దుల్ కలామ్ విగ్రహాలను డీఈఓ శేఖర్, కాణిపాకం ఆలయ ఈఓ వెంకటేశు శుక్రవారం ఆవిష్కరించారు. ఈఓ మాట్లాడుతూ సంఘ సంస్కర్తల కృషితోనే భారతావని గొప్ప సంప్రదాయాలు కలిగిన దేశంగా అవతరించిందని తెలిపారు. డీఈఓ మాట్లాడుతూ మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థుల్లో స్ఫూర్తి నింపవచ్చన్నారు. అనంతరం యోగా, ధ్యాన కేంద్ర భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. బాల్యవివాహాల నిర్మూలనపై ప్రగతి సంస్థ డైరెక్టర్ రమణ రూపొందించి వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ప్రధానోపాధ్యాయుడు ఆనంద్, రిటైర్డ్ ప్రిన్సిపాళ్లు రఘురాం, నారాయణస్వామి, పరమశివన్, సేవ్ నర్సింగ్ కళాశాల కరెస్పాండెంట్ ప్రవీణ్, టీటీడీ ఈఈ మనోహరం పాల్గొన్నారు.

హథీరాంజీ మఠం మహంతుపై వేటు

- సస్పెండ్ చేసిన దేవదాయశాఖ



హథీరాంజీమఠంలో పంచనామా నిర్వహిస్తున్న ఎండోమెంట్ జిల్లా అధికారి రామకృష్ణారెడ్డి, రెవెన్యూ సిబ్బంది

తిరుపతి రూరల్: హథీరాంజీ మఠం ఆస్తుల దుర్వినియోగం, మఠం నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించడం, రికార్డులను సక్రమంగా నిర్వహించకపోవడం వంటి కారణాల వల్ల మఠం మహంతు అర్జున్‌దాస్‌పై వేటు పడింది. ఆయన్ని సస్పెండ్ చేస్తూ దేవదాయశాఖ ధార్మికపరిషత్ తీర్మానించింది. ఆ మేరకు ఇప్పటికే ఆదేశాలు జారీచేసింది. అయితే సస్పెన్షన్ ఉత్తర్వులను తీసుకునేందుకు అర్జున్‌దాస్ అందుబాటులోకి రాలేదు. రెండు రోజులుగా ఎదురుచూస్తున్న ఎండోమెంట్ అధికారులు చివరకు రెవెన్యూ అధికారులను కలిశారు. మండల మెజిస్ట్రేట్ అయిన తిరుపతి అర్బన్ తహసీల్దార్ ఆధ్వర్యంలో ఎండోమెంట్ జిల్లా అధికారి రామకృష్ణారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ జీవన్‌కుమార్, దేవదాయశాఖ తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ ఫణికుమార్, ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ సర్వేయర్ రమేష్‌బాబు, వీఆర్వో కలిసి శుక్రవారం తిరుపతిలోని హథీరాంజీమఠం కార్యాలయానికి వెళ్లారు. సస్పెన్షన్ ఉత్తర్వులను ఇచ్చేందుకు ప్రయత్నించగా.. అర్జున్‌దాస్ అందుబాటులోకి రాకపోవడంతో పంచనామా నిర్వహించారు. ఉత్తర్వులను కార్యాలయ గేటు, అర్జునదాస్ నివాసానికి అంటించారు.

ఫిట్ పర్సన్‌గా విజయసారథి!

హథీరాంజీమఠం మహంతుగా ప్రస్తుత పరిపాలన వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న ఏపీఐఐసీలో ల్యాండ్ విభాగం ఓఎస్‌డీగా ఉన్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విజయసారథిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.